# నీళ్లూ కన్నీళ్లూ

రెండ్రోజుల నుంచి గొరొస్తున్నట్లు లేదే! తనలో తను అనుకున్నట్లు పైకే అన్నాడు సుందరయ్య. చూర్లో మువ్వలు తీసి ఎద్దుమెళ్ళోకట్టి, దాన్ని కాడి కింద అమర్చి, నీళ్ళపీపాని బండికిమరింతగా అంటదీసి కూజా బింది బండి తొట్లో పెట్టుకుంటూ.

ఇంకొక్కక్షణం అయితే కాడిమీద తను బొట్టమోపుగా కూచుంటూ 'ఏహే' అని ఎద్దునదల్చి బండిని బంగళాబావివేపు పరిగెత్తించి ఉండేవాడే!

కాని ఇంతలో లచ్చుమ్మ ఓచేత్తో నడ్డిపట్టుకుని నేలబారుగా వున్నపాకలోంచి బాగావంగి ఇవతలికొచ్చింది. చెర్నాకోల కొడుక్కి అందిస్తూ "ఇంక అది తరచు మనింటికి రాదురా ఎఱ్ఱిమొకమా" అందిముసిముసి నవ్వులు నవ్వుతూ.

అదిలించబోతూన్న ఎద్దుని పగ్గం పట్టి ఆ మట్టన ఆపి "రాదూ? .... ఏం? .... ఎందుకట?" అన్నాడు ఆదుర్దాగా సుందయ్య.

తను ముప్పయ్యేళ్లు పెద్దదయినా, అవతలివాడు తనకి స్వంత కొడుకే అయినా ఆమాట చెప్పడానికి ఇబ్బంది పడింది లచ్చుమ్మ. అందుకే ముఖం ఇంకోపక్కకి తిప్పి కాస్తంత విసుగూ చిరాకూ చూపిస్తూ "ఏం ఏంటి? రాదంతే! అదిప్పుడు పైటలేస్తోంది; పరుగులెడుతూ ఇంకరాదు" అంది. ఆ అనడంలో 'ఇంక నువ్వేం పిచ్చి పిచ్చి ప్రశ్నలు వెయ్యకు – వెళ్లు' అన్న అదలింపు వుంది.

పరికిణీ మీదకి జుబ్బాని తెగ లాక్కుంటూ పరుగులుతీసే గవిరి, ఇంకమీద పరుగులు మానేసి నేలకేసి చూసుకుంటూ నెమ్మదిగా నడుస్తుంది కాబోలు! పైటవేస్తే పరిగెట్ట కూడదేమో మరి! .... ఏమో!

తెల్లారేటప్పటికి రోజూ చూర్లో మువ్వలు మాయం అయ్యేవి! 'ఎద్దుమెళ్ళో కట్టాల్సినవి ఏమయ్యాయా' అని తను వెతుక్కుంటూంటే, పాకబయట ఘల్లుఘల్లు మంటూ చప్పుడు అయి కాళ్ళని సింగారించి, మురిసిపోతూ ఇటూ అటూ సింగిరక్కలా తిరుగుతూండేది గవిరి!

"ఏయ్ గవిరి!" అంటూ తను ఎనకా, పకపకా నవ్వుతూ అది ముందూను.

పాకసుట్టూ పదిసార్లు తిప్పింతాలు పెడితేకాని దొరికేదికాదు. 'జడవదిల్తే మువ్వలిస్తాననీ అదీ, ముందు మువ్వలిస్తేనే జడ వదిలేది' అని తనూ - చివరికి అమ్మ వస్తేనే కాని తగాదా తీరేదికాదు ఏ రోజూ.

ఈ రెండు మూడ్రోజుల నుంచీ మువ్వల చప్పుళ్ళూలేవు, తగాదాలూ లేవు. అందుకే తనకి అదోలా మనస్సంతా వెలితిగా, ఏం తోచకుండా తిక్కగా ఉంది. పైటలేస్తోందా? ... మునుపటిలా తరుచుగా రాదూ? అమ్మ అదోలా నవ్విందేవిటి సెప్మా!

ఆలోచనలు! ..... ఒకటే ఆలోచనలు!

"ఏట్రోయ్ సుందయ్యా! పీపా నిండిపోనాది! ఇంకా పోసేస్తున్నా వేంటి? బంగాళా బావిఅంతా తోడేస్తావేటియాళ?" అంటూ తోటి బళ్ళవాళ్ళూ.

"వొరేయ్ సుందయ్యా! ఇవాళ మా యింట్లో మంచినీళ్ళు పొయ్యలేదుటేం?" అని ప్లీడరుగారూ.

"మాకు రోజూపోసేది ఒక బిందేకదురా పొద్దున్న పోశావు. మరిచిపోయా వేమిటి? మళ్ళీ పట్టుకొచ్చావు" అని పంతులుగారూ, ఇలా ఎంతమంది గుర్తు చేస్తున్నారో పొద్దుటినుంచి తన పరధ్యానాన్ని.

పచ్చనిచెట్లు, నీరెండపడి బంగారు పైటల్లా, గాలికి ఎగురుతూంటే ఎర్రని అంచులున్న తెల్లని మబ్బుముక్కలు, ఆకాశంలో, పాదాలకి పారాణి పెట్టుకున్న పడుచుకత్తెల్లా పరిగెడుతున్నాయి. ఒయ్యారాలుపోతూ - వెళ్ళి పోతున్న వెలుగు, రాబోతూన్న ఆ సమయంలో, బంగళా బావికి కసింత దూరంలో చింతచెట్టు నీడని కనిపించింది గవిరి.

"ఎవరా నీడలో?" అంటూనే ఒక్క పరుగులో దగ్గరికి వెళ్ళి ఆమె ముఖాన్ని రెండుచేతుల్లోకి తీసుకుని "ఏందే! మానేశావు?" అన్నాడు సుందయ్య ఆప్యాయంగా.

గవిరికి వళ్ళంతా ఝుల్లుమంది! సుందయ్య చేతులు, బుగ్గలికి వెచ్చగాతాకుతూ

హాయిగా వున్నాయి. తన్మయస్థితిలో వుండిపోయింది. "ఏందే! కళ్ళు మూసుకుంటావు. అడుగుతూంటే?" అన్నాడు సుందయ్య నవ్వుతూ. అప్పుడుకాని ఈలోకంలోకి రాలేదు గవిరి. వచ్చి, "వుండు, వుండు" అంటూ నెమ్మదిగా అతని చేతుల్లోంచి తప్పించుకొని, రెండడుగులు వెనక్కివేసి దూరంగా నిలబడింది.

"అరే! ఈ పైటలో ఎంత బాగున్నావే! మెరిసిపోతున్నావు? కళ్ళల్లో ఎయ్యి ఎలుగులు!" అంటూ గవిరిని మళ్ళీ దగ్గరగా తీసుకోబోయాడు.

"ఉండమంటూంటే .... దూరంగా ఉండు. ఇదివరకటిలాగ నువ్వు నన్ను ముట్టుకోకూడదట. అయ్యచెప్పాడు. మనువయేదాకా ఎవ్వరూ, ఆఖరికి సుందయ్య కూడా తాకకూడదన్నాడు. తెలిసిందా? మనువు అవాల!"

"ఓస్! అంతేకదా! ఇయ్యాలే అమ్మతోచెప్పి రేపే మనువాడేస్తాను. సరా?" అన్నాడు సుందయ్య.

"వెళ్ళడం చెప్పడం అడగడం అన్నీ అయ్యాయి. కాని మీఅమ్మ 'టాట్ వీల్లేదు' అందిట మా అయ్యతో" అంది గవిరి తన అరచేతులకేసి చూసుకుంటూ వచ్చే కన్నీళ్ళని ఆపుకుంటూను.

"అదేంటి?" సుందయ్య అదిరిపడ్డాడు.

"మావోడు నీళ్లబండిమీద రోజుకి అయిదారు రూపాయలు సంపాయి స్తున్నాడు. ఆడి సంపాదనచూసి మా ..... మా ..... డబ్బున్నవోళ్ళు పిల్లనిస్తామంటూ చూస్తున్నారు. అందువల్ల నువ్వు ఆఖరికి మూడు నాలుగొందలేనా కట్నం పట్టుకొస్తే గవిరిని చేసుకుంటాం అందిట మీ అమ్మ".

"అమ్మ అలాఅందా?" నీరసంగా అన్నాడు సుందయ్య.

"నా దగ్గర దమ్మిడీలేదు. పోనీ ఇయ్యాల కన్నబిడ్డకోసం అని కష్టపడి సంపాదిద్దాం అంటే, కాళ్ళూ సేతులూ సచ్చుడిపోయి ఉన్నాయి. కట్నం ఇచ్చుకోలేను. డబ్బుకోసం ఆళ్ళిద్దర్నీ ఇడదీయకు. గవిరిని నీ కడుపులో ఏసుకో – అంటూ అయ్య కాళ్ళా వేళ్లాపడి బతిమాలాట్ట – కాని మీ అమ్మ ససేమిరా ఒప్పుకోలేదట!"

"మరైతే ఎలాగే గవిరీ! ఇప్పుడేం చేద్దాం" అంటూ నీరసంగా చింత చెట్టుకి జేర్లబడిపోయాడు సుందయ్య.

"ఛ ..... ఛ ..... అదేటి మావా, నువ్వుకూడా అయ్యలాగ దిగాలు పడి పోతావేంటి? ఏదైనా ఉపాయం ఆలోచించాలిగాని" అంది గవిరి.

"ఏ వుంది ఉపాయం? మీ అయ్యా కట్నంతేలేడు. మా అమ్మా కిందికి దిగి రాదు. నేనా మా అమ్మని ఎదిరించి నిన్ను మనువాడలేను. ఇంకెలాగ?"

"ఓరిపిచ్చి సుందయ్యా ఇలా విను. రోజుకి మూడు రూపాయలైతే నెలకి ఎంతవుద్ది?"

"ఏమో!" అన్నాడు సుందయ్య విసుగ్గా.

"అయ్యలాగే నీకూ రావన్నమాట లెఖ్ఖలు? రోజుకి మూడురూపాయలు చొప్పున నాలుగు నెలలకి మూడు వందలు పైన సంపాదించ గలను తెల్సా?" అంది గవిరి కళ్ళెగరేస్తూ.

"నువ్వా? నువ్వు సంపాదిస్తావా? ఎట్టా?"

"ఎట్టాగా? అదిగో అట్టా" అంటూ బావికి కొంచెం దూరంలో, ఊళ్ళోకి కొత్తగా వస్తూన్న పంపుల కోసం, ఎత్తుగా కట్టబోతున్న ఓవర్‌హెడ్ టేంక్‌నీ, దాని కట్టడంలో, ఇసుకా సిమెంటూ రాళ్ళూ అందిస్తూ పని చేస్తున్న మగ ఆడ కూలీలనీ చూపించి కిలకిలా నవ్వింది గవిరి.

ఆరోజు నుంచీ, రోజురోజుకీ అడుగూ అడుగున్నర ఎత్తు చొప్పున లేస్తూన్న ఓవర్‌హెడ్ టాంక్‌తోపాటు, తనూ అలా పై పైకిపోతూ, రాళ్ళూ ఇసుకా నీళ్ళూ మేస్త్రీలకి అందిస్తూ, మధ్య మధ్య సుందయ్యకేసి చూసి కిలకిలా నవ్వేది గవిరి.

ఎత్తులో రాళ్ళు అందిస్తూ గవిరి!

పక్కనే లోతుగా ఉన్న బావినీళ్లు తోడుతూ సుందయ్య!

టేంక్ ఎత్తు పెరిగినకొద్దీ ఇద్దరికీ మధ్య దూరం పెరిగిపోసాగింది.

"ఇంకా పైకెళ్ళిపోతున్నావు. కళ్లు తిరుగుతాయేమో – జాగ్రత్త –నెమ్మదిగా నడు" అంటూ కిందనుంచి అరిచేవాడు సుందయ్య.

గవిరి అతని హెచ్చరిక ఏం పట్టించుకునేది కాదు – కిలకిలా మాత్రం నవ్వేది.

కట్టుబడి నీళ్లకని వచ్చినప్పుడల్లా, గవిరిని బావిలో బొక్కెన వెయ్యనిచ్చేవాడు కాదు సుందయ్య. ఎన్ని కడవలేనా తనే తోడి, ఇచ్చి "పట్టికెళ్లు" అనేవాడు.

అలాగే గవిరికూడా మధ్యాహ్నం అన్నానికి, సుందయ్యను ఇంటికి వెళ్లనిచ్చేది కాదు. తను తెచ్చుకున్న దాంట్లోనే సగం, కేరియర్ మూతలో పెట్టి, 'తిను' అని

ఉల్లిపాయో, మిరపకాయో నంచుకోడానికి ఇచ్చేది. ఇద్దరూ అలా చింతచెట్టు నీడని నవ్వుకుంటూ ఊసులాడుకుంటూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ అన్నం తింటూంటే, పొద్దుటినుంచీ పడ్డశ్రమ మరిచిపోయేవారు. అంతా అన్నాలు తినడం మానేసి తమకేసే చూస్తున్నారు అనే సంగతికూడా వాళ్ళకి పట్టేదికాదు.

వాళ్ళేమో - వాళ్ళలోకమేమో - అంతే!

'ఈ మంత్రివర్గం అయినా మారిపోకుండా పంపులకి ప్రారంభోత్సవం చేయించాలి' అని పట్టుదలతో డిపార్ట్‌మెంటువాళ్ళూ కంట్రాక్టరూ ఉన్నారేమో, కట్టుబడి చకచకాసాగి, నాల్గు నెలలు పూర్తిగా తిరక్కుండానే, సర్వమూ పూర్తి అయి, తెల్లారితే పురపాలక శాఖామాత్యులు వచ్చి ఊళ్లో కుళాయిలకి ప్రారంభోత్సవం చేసేస్థితికి వచ్చింది.

ఊరంతా రంగు రంగుల తోరణాలు కట్టారు. సరిజేసుకుంటూన్న మేళ తాళాలతో ఊరంతా మారుమ్రోగిపోతోంది.

ఇన్నాళ్ళకి ఊరికి కుళాయిలొస్తున్నాయి కదా అని ఊరి అశేషప్రజల కళ్ళల్లోనూ లక్ష వెలుగులు!

పెళ్ళికి కావలసిన కట్నం డబ్బు తను కష్టపడి సంపాదించిన ఆనందం గవిరి మనస్సుకి కొంచెం కష్టం కలిగించి కట్నంసంగతి ముల్లులా వేధిస్తున్నా, తమ పెళ్ళికి ఇంక ఎలాంటి అడ్డంకూలేదని సుందయ్య సంబరం.

ఇద్దరి కళ్ళల్లోనూ కోటికాంతులు!

"మావా! ఇదిగో డబ్బు! మీ అమ్మదగ్గరికి ఎళదాం పద - ఈ తోరణాలూ, వీరణాలూ ఇవన్నీ మన పెళ్ళికోసమే - ఇయాలే చెయ్యమందాం మన పెళ్ళి - మనపెళ్ళికి ఆకాశం అంత పందిరి - భూదేవంత అరుగూను".

గవిరి పొంగిపోతూ అంటూన్న ఆ మాటలకి ఉప్పొంగిపోయాడు.

గవిరిని అమాంతం ఎత్తుకుని నీళ్ళ బండిమీద కూర్చోబెట్టాడు. 'ఎహె' అని ఎద్దుని అదిల్చి మధ్య మధ్యలో సంతోషం పట్టలేక ఈలవేస్తూ, నిండు నీళ్ళ బండిమీద తన బంగారి గవిరిని ఊరేగిస్తూ తను పక్కనే నడుస్తూ ఆఘమేఘాలమీద తన పాక దగ్గరికి చేరుకున్నాడు సుందయ్య.

అక్కడ సుందయ్యతల్లి లచ్చమ్మా, గవిరి తండ్రి గంగులు అరుచుకోవడం విని కొయ్యబారి నిలబడిపోయారు గవిరీ సుందయ్యానూ -

"అల్లిద్దరూ సిలకా గోరింకల్లా వుంటున్నారు, అళ్ళని ఇడదియ్యడం నేయం కాదు" అంటూ కాళ్ళా వేళ్ళా పడుతోంది లచ్చుమ్మ.

"నేనిడదయ్యడమేవిటే ఎర్రిదానా! లచ్చనంగా పిల్లనిస్తానని ఆరోజొస్తే మావోడు రోజుకి అయిదు సంపాయిస్తున్నాడు. మామావోళ్లు పిల్లనియ్యడాని కొస్తున్నారు. కట్నంతే అంటూ నన్ను తరిమి ఆనాడు నువ్వే ఇడదీశావు అళ్ళని. ఇయాళ నా తల్లి కట్నం డబ్బులు సంపాయించింది. దాంతో నేనే మమా వోళ్ళని కొంటాను. సుందయ్య కెందుకే పిల్లనియ్యడం? ఆడేం పెళ్ళాన్ని పోషించగలడా ఏవన్నానా? ఇయాళ పంపువొదులుతున్నారు. ఇంక ఆడి బండినీళ్ళు ఎవరిక్కావాలి? అదిగో సూడు, బండెడు నీళ్ళు ఆ మట్టున అలానే వున్నాయి – సుందయ్యకియ్యలేదని యాష్టపడక ఇద్దరూ గవిరి పెళ్ళికి రండి" అంటూ గంగులు ఏడుస్తూన్న గవిరిని ఎత్తుగావున్న బండిమీంచి కిందకిలాగి గబగబ తన పాకకేసి ఈడ్చుకుపోయాడు.

లచ్చుమ్మ గోడకిజేర్లబడి గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయింది.

చుక్క చుక్క చొప్పున కన్నీళ్ళు రాలుస్తూన్న నీళ్ళపీపాకేసీ, జరిగిపోయింది నెమరేసుకుంటూ జరగబోయేది ఏమిటా అని కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్న ఎద్దుకేసీ, కనురెప్పవేయకుండా చూస్తూ, ప్రాణంలేని కట్టెలా నిలబడిపోయాడు సుందయ్య.

తెల్లారింది – ఊరంతా పంపులు తెరుస్తూన్న సంరంభం. మైకులు – పాటలు – మంత్రోచ్చాటనలు – మంత్రిగారు వచ్చేసరికి పరిసరాలు శుభ్రంగా వుండాలనే తపనతో, కట్టుబడిలో మిగిలిపోయిన కర్రా కంపా అంతా ప్రస్తుతానికి పక్కనే వున్న బంగళా బావిలో పడేసి చుట్టూ వున్న ప్రదేశం అంతా అందంగా చదును చేసి బాగుచేయిస్తున్నారు అధికారులు.

వాటర్‌వర్క్స్ వాచ్‌మేన్‌తో జీవితం పంచకోబోతూన్న గవిరికి కళ్ళకి కాటుకా బుగ్గనిచుక్కా ఎంతకీ అమరటం లేదు.

తనచేతుల్తో తనే ఈ టేంక్ కట్టుబడికి సాయంచేసి, సుందయ్య కూడు పడగొట్టింది. తన అదృష్టాన్ని పడదోసుకుంది.

ఆరోజున టేంక్ కట్టుబడిలో పై పైకిపోతూన్న నాచెయ్యెట్టుకుని గుంజి కిందకి ఎందుకు లాగెయ్యలేదుమావా!

ఇప్పుడు చూడు – ఇద్దరం ఎంత దూరమైపోయామో!

ఇయ్యాల అందరి ఇళ్ళల్లోనూ తియ్యని పానకాలలాంటి నీళ్ళే! కాని మరి ..... మరి .... మన కళ్ళల్లోనో?

"మావా!" అంటూ కెవ్వున కేకేసింది గవిరి.

ఎంత ప్రయత్నంచేసినా గవిరికి కళ్ళని కాటుకా, బుగ్గని చుక్కా కుదరడం లేదు.

చుక్క సురిగిపోతోంది!

కాటుక కరిగిపోతోంది!

ఎక్కడ చూసినా నీళ్ళు - ఒకటే కన్నీళ్ళు -

ఊళ్ళో - వీధుల్లో -

లచ్చుమ్మ మనసులో -

సుందయ్య గుండెల్లో -

గవిరి కళ్ళల్లో -

నీళ్ళు! నీళ్ళు! నీళ్ళు! ఒకటేనీళ్ళు!

(స్వాతి, జూన్ 1982)

*